## క్లుప్తంగా

### దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

కాటారం: మండలంలోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో సోమవారం భక్తులు సామూహికంగా అనఘాదేవి వ్రతం నిర్వహించారు. ఆలయ పురోహితులు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో భక్తులు వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతం చేశారు. కాంగ్రెస్ యూత్ నాయకుడు, మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీను బాబు దత్తాత్రేయుడు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

మల్హర్: 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు విద్యార్థుల నుంచి 2025 జనవరి 6 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎడ్లపల్లి మోడల్ కళాశాల ప్రిన్సిపల్ పూర్ణచందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోవ తరగతిలో అన్ని సీట్లకు ప్రవేశాలు ఉంటాయని, ఏడు నుంచి పదో తరగతి వరకు ఆయా ఖాళీల ఆధారంగా భర్తీ చేస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ విద్యార్థులు రూ.125, ఓసీలు రూ.200 చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించి, అప్లై చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని, అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని పేర్కొన్నారు.

### కమిటీ ఎన్నిక

చిట్యాల: ఎమ్మార్పీఎస్ కళామండలి జిల్లా కమిటీని మండల కేంద్రంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఓనపాకల కుమార్, ఉపాధ్యక్షుడిగా పుల్యాల నరేష్, ప్రధానకార్యదర్శిగా పుల్ల ప్రతాప్, కార్యదర్శిగా సతీష్, సహాయ కార్యదర్శిగా యుగందర్, కోశాధికారిగా శాస్త్రాల తిరుపతి, సలహాదారులుగా దేవేందర్, బాలు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సతీష్, కార్యవర్గ సభ్యులుగా దివాకర్, నరేష్, శ్రీను, ప్రియాంక, నిర్మల, శివ ఎన్నికయ్యారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



చిట్యాల: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని వెంకట్రావుపల్లి(సి) శివారు మోడల్ స్కూల్ వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వెంకట్రావుపల్లి(సి)కి చెందిన పుల్ల సదానందం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో రేగొండ మండలంలోని నిజాంపల్లికి చెందిన టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకి తరలించారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రేగొండ: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు రేగొండ ఎస్సై షేక్ ఖాన్ తెలిపారు. మండలంలోని చెక్ పోస్ట్ వద్ద ట్రాక్టర్ ను పట్టుకుని విచారించారు. ఇసుక తరలింపున కు అనుమతి పత్రాలు లేవని గుర్తించారు. ట్రాక్టర్ డ్రైవర్ ఉట్ల అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ

వెంకటాపురం(ఎం): మండలంలోని లక్ష్మీదేవిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రెండు వేల రూపాయల విలువచేసే స్టడీ మెటీరియల్‌ను దాత నల్లబెల్లి సాంబయ్య ఉచితంగా అందించగా ఎంఈఓ తాళ్ల ప్రభాకర్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. .. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

### రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సౌమ్య

వెంకటాపురం(ఎం): మేడ్చల్ జిల్లాలోని హకీంపేటలో ఈనెల 24, 25న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియార్ కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని మైనార్టీ కళాశాలకు చెందిన సౌమ్య ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వందన, పీడీ నవ్య తెలిపారు. ఇటీవల కర్లపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో సౌమ్య ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా సౌమ్యను అధ్యాపక బృందంతో పాటు సహచార విద్యార్థులు అభినందించారు.

### పనులు షురూ..

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కోసం సీఆర్ఆర్ గ్రాంటుతో రూ.75 లక్షలు నిధులు మంజూరయ్యాయి. వాటితో పనులు మొదలు పెట్టేందుకు గతంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన ఫెనింగ్ తొలగింపు పనులు సోమవారం చేపట్టారు. గ్రామ పంచాయతీ సిబ్బంది సెంట్రల్ లైటింగ్ పనులకు అడ్డు లేకుండా ఫెన్సింగ్‌ను తొలగిస్తున్నారు.

# కొత్త జీపీల ఏర్పాటుకు కసరత్తు

- పెరుగనున్న మరో రెండు పంచాయతీలు?
- దబ్బగట్టు, పాత రుద్రారం ఏర్పాటుకు ప్రతిపాదనలు



పాత రుద్రారం గ్రామ ముఖ చిత్రం

మల్హర్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు కసరత్తు జరుగుతున్న తరుణంలో మండలంలో మరో రెండు గ్రామ పంచాయతీల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే కొత్త జీపీల వివరాలు, వాటి పేర్లు, విస్తీర్ణం, వార్డుల సంఖ్య, జనాభా సంఖ్య తదితర వివరాలతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. కొత్త జీపీల ఏర్పాటుకు సాధ్యమైనంత త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. మండలంలో మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టు, రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని పాత రుద్రారం గ్రామం కొత్త జీపీ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు జిల్లా అధికారుల వద్దకు వెళ్లాయి.

**రెండు జీపీల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

మండలంలో మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టు (రావులపల్లి), రుద్రారం గ్రామ పంచాయతీలోని పాత రుద్రారం గ్రామాలను పునర్విభజన చేసి కొత్త జీపీలు ఏర్పాటు చేయనున్నారు. దబ్బగట్టులో 444 జనాభా, 07 వార్డులు, మల్లారం జీపీ నుంచి దబ్బగట్టుకు ఉన్న దూరం 1.5 కిలోమీటర్లతో ఉన్న గ్రామం పరిధిలోని సర్వే నంబర్లతో కూడిన నివేదికతో జీపీ ఏర్పాటుకు అధికారులు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు. అలాగే రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని పాత రుద్రారం గ్రామ పంచాయతీ ఏర్పాటుకు 07 వార్డులు, 340 జనాభా, రుద్రారం నుంచి పాత రుద్రాతాన్ని దూరం 8.2 కిలోమీటర్లు విస్తీర్ణంతో నివేదకను సమర్పించారు. ప్రస్తుతం ఉమ్మడి మల్లారం గ్రామ పంచాయతీలో 2574 జనాభా, ఉమ్మడి రుద్రారంలో 3070 మంది జనాభా ఉన్నారు. మండలంలో ఇప్పటికి 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం మరో రెండు జీపీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి గెజిట్ వెలువడితే 17 గ్రామ పంచాయతీలు కానున్నాయి.

**ప్రతిపాదనలు పంపించాం..**



మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టు, రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని పాత రుద్రారం గ్రామాలు నూతన జీపీల ఏర్పాటుకు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాం. తదుపరి కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారు.

– శ్యామ్‌సుందర్, ఎంపీడీఓ, మల్హర్

**ఎన్నికల నిర్వహణకు కసరత్తు**

పంచాయతీ పాలకవర్గాల గడువు గత ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగతోంది. కొత్త సర్పంచ్‌ల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. మాస్టర్ ట్రైనర్లు, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులకు ఎన్నికల విధి విధానాలు, ఓటరు జాబితాల రూపకల్పన, వార్డుల విభజన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇప్పటికే పోలింగ్ స్టేషన్లలో ఓటరు తుది జాబితాను ప్రదర్శించారు. కొత్త జీపీల ఏర్పాటుకు గెజిట్ విడుదలైతే వాటికి సైతం ఎన్నికలు నిర్వహిస్తారా లేదా అనేది ప్రభుత్వం తీసుకోని నిర్ణయంపై ఆధారపడి ఉంది.

# నూతన విధానంతో రైతులకు నష్టం

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజినీకాంత్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, రైతులు.

చిట్యాల: నూతన వ్యవసాయ మార్కెట్ విధానంతో రైతులకు నష్టం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల రజినీకాంత్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలు దేశంలోని శ్రామిక ప్రజలను సవాల్ చేస్తున్నాయని అన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానం వల్ల సామాన్యులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభలుత్వం కార్పొరేట్ సంస్థలకే కొమ్ముకాస్తూ శ్రామికుల నడ్డి విరుస్తుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలతో చర్చించి, గ్రేటర్ నోయిడాలో ఉన్న రైతు నాయకులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగరాజు, రాజయ్య, రాజకొమురు, విజేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

# రహదారి బాధితులను ఆదుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ

వాజేడు: జగన్నాథపురం నుంచి చెరుకూరు వరకు నిర్మించనున్న జాతీయ రహదారి విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న బాధితులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పేద ప్రజల ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారికి ఇరువైపులా ఉన్న ప్రజలకు అవగాహన కల్పించి వారికి జరిగే నష్టం విలువను ముందుగానే తెలిపి పరిహారాన్ని వెంటనే ఇచ్చేలా చూడాలన్నారు. సర్వే సమయంలో కొంత పోతుందని తెలిపి ప్రస్తుతం ఎక్కువ భాగం పోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు పెసా గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. రఘుపతి, దేవయ్య, కృష్ణ బాబు, సామ్య ఉన్నారు.

# మంత్రికి తెలియకుండానే ఫ్యాక్టరీ వస్తుందా?

- బీఆర్ఎస్ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ గీత



మాట్లాడుతున్న కేదారి గీత

కాళేశ్వరం: మంత్రి శ్రీధర్‌బాబుకు తెలియకుండానే పలిమెలకు సిమెంట్ ఫ్యాక్టరీ ఎలా వస్తుందని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ కేదారి గీత ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రి సోదరునికి దక్కన్ సిమెంట్ కంపెనీలో వాటాల కోసం దళిత, గిరిజన భూములను లాక్కోవడం ఎంతవరకు సమంజసమని అన్నారు. దళిత, గిరిజనులపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే తన అనుచరులతో దక్కన్ సిమెంట్ కంపెనీ పేరుమీద చేయించిన అక్రమ పట్టాలను రద్దు చేసి అందులో తరతరాలుగా సాగుచేసుకుంటున్న నిజమైన అర్హులైన దళిత, గిరిజన రైతుల పేరిట మార్పు చేయాలని డిమాండ్ చేశారు. మహదేవపూర్ మహిళా అధ్యక్షురాలు చిలుక సునీత, ఎలకేశ్వరం మహిళా అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

# క్రీడల్లో గెలుపోటములు సహజం



గణపురం: బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్: క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే, అధికారులు, పాస్టర్లు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన క్రీడాకారులు నిరుత్సాహం చెందకుండా గెలుపొందే వరకు పోరాడాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని సీతరాంపురం గ్రామంలో వన్ స్టార్ వన్ యూనియన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి షటిల్ ప్రీమియర్ లీగ్ సీజ్–2 టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. విన్నర్ టీంకు 10వేల రూపాయల చెక్కుతో పాటు బహుమతి, రన్నర్ టీంకు రూ.5 వేల చెక్కుతో పాటు బహుమతిని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు క్రీడాకారులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

**అమిత్‌షా క్షమాపణ చెప్పాలి..**

భూపాలపల్లి రూరల్: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, నాయకులు దేవన్, బుర్ర కొమురయ్య, పిప్పాల రాజేందర్ పాల్గొన్నారు.

**క్రీస్తు బోధనలు పాటించాలి**

క్రీస్తు బోధనలు పాటించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మంజూరు నగర్ కల్వరీ చర్చిలో ఏర్పాటు చేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ శాఖ అధికారిణి శైలజ, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్ రెడ్డి, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, కోఆప్షన్ మెంబర్ నేరుపట్ల కమల, ప్రజా ప్రతినిధులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, కప్పల రాజేష్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కర్ణాకర్, పాస్టర్లు, రాజ్‌కుమార్, రాజవీరు, డెవిడ్‌రాజ్, మనో హర్, జాన్ రమేష్, ధామస్, సంపత్‌రావు పాల్గొన్నారు.

# రైతులను గౌరవించడం బాధ్యత



అగ్రి ఎక్స్‌పో ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

కాటారం: ఎంతో శ్రమనోడ్చి పంట పండించి అన్నం పెట్టే రైతన్నను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు అన్నారు. కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్‌లో సోమవారం జాతీయ రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని రైతులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయంపై అవగాహన కల్పించి పనిముట్ల వియోగం, ఎదుర్కొనే సమస్యలను విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం నిర్వహించిన ఆదర్శ అగ్రి ఎక్స్‌పో ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. రైతులకు అవసరమయ్యే ఆధునిక పనిముట్లు, వినూత్న పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయంలో ఏఐ ఇంటిగ్రేషన్‌ను వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత, రైతులు కొట్టె శ్రీహరి, శేఖర్, జనార్ధన్, చీమల మల్లయ్య, వెంకట్రాజం, తోట బాపు, డొంగిరి రాజయ్య, గట్టయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# వరిసాగులో జాగ్రత్తలు తప్పనిసరి

- ఏఓ వాసుదేవరెడ్డి

రేగొండ: యాసంగి వరి సాగులో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి తెలిపారు. సోమవారం రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు మొదటగా నారు మడిని బాగా దున్ని మూడు సార్లు దమ్ము చేసి చదును చేసుకోవాలన్నారు. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు మడిలో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పోటాశ్‌తో పాటు పశువుల పేడ వేయాలన్నారు. జింకు లోపం సవరణకు లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరి నారు నాటు వేయాడానికి సిద్ధంగా వచ్చిన సమయానికి వారం ముందు గుంట నారు మడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లాలలన్నారు. నాటు వేయాడానికి 15 రోజుల ముందు దమ్ము చేయాలన్నారు. జీవన ఎరువులు అనగా అజోలా 150 కిలోలు, 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ పొలంలో వేసి మూడు వారాల పాటు పెరగనిచ్చి నేలలో వేసి కలియదున్నాలని తెలిపారు. నాటు వేసిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు ఒకటి చొప్పున కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సాగులో సమస్యలు తలెత్తితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న మధువంశీకృష్ణ

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన మాదాసు దేవేందర్, అల్లం సునీతలకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మొకిరాల మధువంశీకృష్ణ సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఆస్పత్రి చికిత్స పొంది ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో తోడ్పాటును అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు చిలుకల రాయకొమురు, గంగాదర్ రవీందర్, గుర్రపు తిరుపతి, ఉయ్యాల రమేష్, గుర్రపు నర్సయ్య, తదితరులు ఉన్నారు.

# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- దుగ్యాల రాంచందర్‌రావు

టేకుమట్ల: కేంద్ర ప్రభుత్వ పథకాలను బూత్‌స్థాయి నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దుగ్యాల రాంచందర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని అంకుషాపూర్‌లో బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని, 2027ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం బూత్ కమిటీ వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా సాద సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా దానవేని చిన్నకుమార్ ఉపాధ్యక్షులుగా పోతనవేని స్వామి, కార్యదర్శిగా చిలుక ప్రణీత్, కోశాధికారిగా రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదరి, గుర్రపు నాగరాజు, సోషల్ మీడియా బూత్ అధ్యక్షులు అబ్బెంగుల హరీష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ నాంసాని రమేశ్‌పాల్గొన్నారు.



టేకుమట్ల: నియామక పత్రం అందిస్తున్న రాంచందర్‌రావు

చిట్యాల: బూత్ కమిటీలతోనే భారతీయ జనతా పార్టీ పటిష్టమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ అన్నారు. సోమవారం మండలంలోని నవాబుపేట, చింతకుంటరామయ్యపల్లి, కైలాపూర్ గ్రామాలలో బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు బిల్ల సత్యనారాయణ రెడ్డి, రాయిని శ్రీనివాస్, మందల రాఘవ రెడ్డి, మాదారావు రాజు, కత్తుల ఐలయ్య, చింతల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుపై వంటావార్పు చేసి నిరసన



రోడ్డుపై భోజనం చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

ములుగు: ఇన్నాళ్లు క్షేత్రస్థాయిలో విద్యార్థుల ఉన్నతికోసం పనిచేసి తమకు కష్టం వచ్చిందంటే ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించడం లేదని ఆదుకుంటారా.. రోడ్డున పడేస్తారా ప్రభుత్వానికే వదిలేస్తున్నామని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఆవరణలో చేపడుతున్న దీక్ష సోమవారంతో 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు రోడ్డుపై వంటావార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి భోజనం చేసి సూత్రపాయంగా తమ బతుకులు రోడ్డుపై పడ్డాయని ప్రభుత్వానికి తెలియజేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్ పాడ్య, ఉపాధ్యక్షుడు ఫిరోజ్, కార్యవర్గ సభ్యులు సుజాత, రమేష్, సమన్వయకర్తలు రాజేశ్వరీ, జయ, వసంత, వెంకటలక్ష్మీ, శిరీష, సుజాత, అరుణ, భాగ్యలక్ష్మీ, ప్రవీణ్, నాలం బాయి, రవి తదితరులు పాల్గొన్నారు.

### కొయ్యూరు గ్రామ సందర్శన



రాష్ట్ర నాయకులతో మహేందర్

మల్హర్: మండలంలోని కొయ్యూరు గ్రామాన్ని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన సమస్యలను మండల కమిటీ అధ్యక్షుడు వేల్పుల మహేందర్, ఉపాధ్యక్షుడు వేల్పుల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి తిప్పల రజిత రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యల పరిష్కారా నికి సానుకూలంగా స్పందించినట్లు వారు వెల్లడించారు.

# ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమించాలి

- పొదెం కృష్ణ ప్రసాద్

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని విద్యాసంస్థల్లో పనిచేసే కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమించి హక్కులను, డిమాండ్లను సాధించుకోవాలని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయుల సంఘం గౌరవ అధ్యక్షుడు పొదెం కృష్ణ ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ పక్కన ఉన్న ప్రధాన రోడ్డుపై ఉమ్మడి వరంగల్, కరీనంగర్ జిల్లాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు నిరవధిక సమ్మెను చేపట్టగా కృష్ణప్రసాద్ హాజరై మాట్లాడారు. సీఆర్టీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు పొదెం రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో 2003 సంవత్సరాల నుంచి కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ వ్యవస్థ ప్రారంభమైన ఇప్పటి వరకు చాలీ చాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న తహసీల్దార్ సృజన్ కుమార్

గోవిందరావుపేట: దాతల సహకారంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ చంద్రకళ ఆధ్వర్యంలో తహసీల్దార్ సృజన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన విద్యావేత్త ఎస్ఆర్ఐ వీరపనేని డాంగే కళాశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్యక్రమానికి దాతగా ముందుకు రావడం సంతోషకరమైన విషయమన్నారు. మండలంలోని రైస్ మిల్లర్స్ యజమానులు రామకృష్ణ, సతీష్, శేఖర్ రెడ్డి మధ్యహ్న భోజన కార్యక్రమానికి సహకరించడం శుభపరిణామం అన్నారు. దాత వీరపనేని లక్ష్మీ, సోమారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య వైజ్ఞానిక సదస్సుకు విద్యార్థులు



వరంగల్ రీజినల్ సెంటర్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

ఏటూరునాగారం: మండలంలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు విద్య వైజ్ఞానిక సందర్శనకు తరలివెళ్లారు. సోమవారం వరంగల్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్, వెయ్యి స్తంభాల గుడి, వరంగల్ కోట ప్రదేశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సందర్శించి అక్కడ విషయాలను తెలుసుకున్న జీవశాస్త్రం ఉపాధ్యాయుడు పొడెం సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సులోచన, సరిత, శోబ, రాములు, రవి, శశిధర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410